క్లుప్తంగా

గుడుంబా స్వాధీనం


గుడుంబా తరలిస్తున్న గిరిబాబు

కన్నాయిగూడెం : నిషేధిత గుడుంబా క్రయ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మండలం కేంద్రంలో మంగళవారం రాత్రి ఏటూరు వద్ద ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన దుర్గం గిరిబాబు గుడుంబా తరలిస్తు పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి సుమారు రూ.6వేల విలువైన గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ.. గుడుంబా తరలిస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే 8712670139, 8712670089కు సమాచారం తెలపాలన్నారు.

జర్నలిస్టుపై దాడి.. నిరసన

సాక్షి నెట్‌వర్క్ : తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు శ్రీకాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తూ ములుగు,ఏటూరునాగారం,ఎస్ఎస్ తాడ్వాయి, మంగపేట, వెంకటాపురం(కె) , వాజేడు మండల కేంద్రాల్లో వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క జర్నలిస్ట్‌పై దాడిని ఖండించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



టేకుమట్ల : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేష్ ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పరామర్శించి, రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్క విజయ్‌గౌడ్, కత్తి సంపత్‌గౌడ్, పెరుమాండ్ల తిరుపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక



మల్హర్ : మండలంలోని చిన్నతూండ్లలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రుద్రారపు రామచంద్రం మాదిగ, మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పులిగంటి అవినాష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా పులిగంటి రాజబాపు, ఇందారపు భీమ్, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, సహాయ కార్యదర్శి రాకేష్, కోశాధికారి సాయి, గౌరవ అధ్యక్షుడిగా నరసయ్య, రాజయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పెద్ద రవి, రామ్‌చరణ్, వెంకటేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన నాయకులు



కాటారం : కాటారం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సూర్య నారాయణను బుధవారం మండలంలోని మాజీ సర్పంచ్ కారెంగుల తిరుపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాలాభిషేకం



మొగుళ్లపల్లి : రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమకావడం పట్ల బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి మహమ్మద్ రఫీ, తక్కల్లపల్లి రాజు, బండి సుదర్శన్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, రమేష్, రాము, ప్రసాద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ పంచాయతీ కార్యాలయంలో కామన్ సర్వీస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగి ఉన్న రికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరు లేబర్ కార్డు కలిగి ఉండాలని సూచించారు.

తెరుచుకోని గిరిజన పాఠశాలలు

- రోడ్లపైనే విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కన్నాయిగూడెం : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 12వ తేదీనుంచి పునఃప్రారంభం అయ్యాయి. పాఠశాలలు తెరిచిన రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పుస్తకాలు అందించాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ మండలంలో వివిధ గ్రామాల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన విద్యాలయాలు మాత్రం ఇంకా తెరుచుకోలేదు. పాఠశాలలు పునఃప్రారంభమై సుమారు 13 రోజులు పూర్తయిన ఇంతవరకు పాఠశాలను తెరవకుండా ఉపాధ్యాయులు అటు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పాఠశాలల్లో చదువుకోవల్సిన విద్యార్థులు విద్యకు దూరమై రోడ్లపై తిరుగుతున్నారు. రూ.వేలల్లో జీతాలు తీసుకోని విద్యార్థులకు బోధించాల్సిన ఉపాధ్యాయులు విధులకు హాజరు కావడం లేదని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవ తీసుకోని పాఠశాలను తెరిపించాలని కోరుతున్నారు.



తుపాకులగూడెంలోని గిరిజన పాఠశాల

చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

మండలంలోని గిరిజన గ్రామాల్లో సర్వాయి, తుపాకులగూడెం, గంగూడెం గ్రామాల్లో ఐటీడీఏ ద్వారా ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ నిధులతో గిరిజన పాఠశాలలను ఏర్పాటు చేసి అక్కడ బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించింది. గతేడాది వేసవి సెలవులతో మూతబడిన పాఠశాలలు ఇంత వరకు తెరుచుకోలేదు. ఇందులో చదువుకుంటున్న విద్యార్థులు సర్వాయిలో 12 మంది బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు పాఠశాలకు సుమారు 2 కిలోమీటర్లు కాలినడకన వాగు దాటుకుంటు పాఠశాలకు వచ్చి వెళ్తున్నారు. తుపాకులగూడెంలోని 15 మంది విద్యార్థులు, గంగూడెంలోని విద్యార్థులు మాత్రం పాఠశాల తెరుచుకోకపోవడంతో రోడ్లపై, చెరువు గట్లపై వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

పాఠశాలను తెరిపించాలి



విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. మండలంలో ఏర్పాటు చేసిన గిరిజన పాఠశాలను వెంటనే తెరిపించాలి. స్కూళ్లు తెరుచుకోని రోజులు గడుస్తున్నా ఎవరూ రావడం లేదు. పిల్లలు రోడ్లపై తిరుగుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఆలం రామయ్య, తుపాకులగూడెం

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి


రోడ్డు భద్రతా నియమాలు పాటించిన వాహనదారులను సన్మానిస్తున్న డీఎస్పీ రవీందర్

- డీఎస్పీ రవీందర్

ములుగు రూరల్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ రవీందర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తున్న వారిని అభినందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. జరిమానాల కోసం కాదు..మీ ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో సీఐ సురేష్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గోవిందరావుపేట : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పస్రా ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుంపెల్లిగూడెంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు సహకరించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సామ శ్రీనివాస్, భూక్య రాజు, యాకాంబ్రం, అభిలాస అఫ్జల్, రవికిషోర్, ఐలయ్య, జనార్దన్, రమేష్, అశోక్, రాజేశ్వరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై కమలాకర్

అబ్బాయిగూడెంలోనే 'పీసా' సభ నిర్వహించాలి

వెంకటాపురం(కె) : అబ్బాయిగూడెం గ్రామంలోనే పీసా గ్రామసభ నిర్వహించాలని బుధవారం గ్రామస్తులు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసా చట్టం ప్రకారం అబ్బాయిగూడెం గ్రామంలోనే గ్రామ సభ నిర్వహించాలని కోరారు. మొర్రవాని గూడెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం వల్ల వేరే సొసైటీ సభ్యులు వచ్చి గొడవలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారారులు పీసా గ్రామసభను అబ్బాయిగూడెం గ్రామంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

'సంక్షేమ పథకాలను ఓర్వలేకనే విమర్శలు'


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్


పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు దళిత, రైతుబంధు పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను మోసం చేసింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. పార్టీలు మారుకుంటూ చిల్లర రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బెజ్జూరి శ్రీనివాస్, నాయకులు భూషనబోయిన రవికుమార్, ఎనగంటి నరేష్, అలేటి జైపాల్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్

ఏటూరునాగారం : రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఆ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓడవాడలో సీఎం, మంత్రుల చిత్ర పటాలకు రైతులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కిరణ్, గణేష్, కేశవులు, బాలరాజు, రియాజ్, నర్సింగరావు, ఎల్లయ్య, మధుబాబు, ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

అటవీ భూముల పరిశీలన


ఫారెస్ట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్‌ఓ

మల్హర్: మండలంలోని తాడిచర్ల, కాపురం పరిధిలోని అటవీ భూములు కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు జెన్‌కో సంస్థకు అటవీశాఖ కేటాయించిన ఫారెస్ట్ భూమి వివరాలను సిబ్బందిని అడిగి తెలుకోని, మ్యాప్‌ను పరిశీలించారు. కాపురం శివారులో కంపార్ట్ నంబర్ 432లో 38 హెక్టార్లు అటవీ భూమిని కేటాయించినట్లు కొయ్యూరు రేంజర్ రాజేశ్వర్‌రావు సీసీఎఫ్‌కు వివరించారు. అటవీ శాఖకు జెన్‌కో సంస్థ 38 హెక్టార్ల భూమి కేటాయించడంతోపాటు చెట్లకు సైతం పరిహారం అందించినట్లు చెప్పారు. అనంతరం ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. అడవుల సంరక్షణకు సిబ్బంది పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి, ఎఫ్‌డీఓ అప్పల కొండయ్య, తాడిచర్ల సెక్షన్ అధికారి లక్ష్మణ్, ఏఎమ్మార్ అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

గోవిందరావుపేట : పదో తరగతి ఫలితాల్లో పస్రా జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థిని బెజ్జరబోయిన శ్రవంతి ఉత్తమ మార్కులు సాధించింది. కాగా అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పొన్నం లవకుమార్ ఆమెకు చేయూతనందించారు. బుధవారం విద్యార్థికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్, గురువు కళ్యాణపు రమేష్ రూ.10 వేలు నగదు అందజేశారు. రమేష్ మాట్లాడుతూ లవకుమార్ ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తూ నిరుపేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని అన్నారు.

బుక్స్, వాటర్ బాటిళ్ల పంపిణీ



ములుగు రూరల్ : ములుగు పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీకే పుస్తకాలు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడువైపు పోకుండా కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

ఏటూరునాగారం : పాఠశాల అభివృద్ధికి దోహదపడుతామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండలంలోని నార్త్ పాఠశాలను నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సౌకర్యార్థం తాత్కాలిక బస్ షెడ్ నిర్మాణం

ములుగు రూరల్ : ములుగు జిల్లాకేంద్రంలోని సర్వే నంబర్ 409లోని దేవాదాయ శాఖ కు చెందిన భూమిలో ప్రజల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ తాత్కాలిక బస్ షెడ్ నిర్మాణ పనులు చేపడుతున్నామని తహసీల్దార్ విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలో ఉన్న బస్టాండ్ నిర్మాణ పనుల నేపథ్యంలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎలాంటి అన్యాక్రాంత జరగకుండా చూస్తామని తెలిపారు.

సన్నధాన్యం బోనస్ జమచేయాలి


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ములుగు రూరల్ : సన్నరకం ధాన్యం బోనస్ డబ్బులు రైతులకు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా సివిల్ సప్లయీ అధికారి ఫైజల్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు కావొస్తున్న ఇప్పటికి బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాలేదని పేర్కొన్నారు. వర్షాకాలం పంటల సాగు మొదలవడంతో రైతులకు పెట్టుబడులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా బోనస్ అందించాలని కోరారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండి నర్సయ్య, బోడ రమేష్, కృష్ణయ్య, నారాయణ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాహిల్

వాజేడు : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే దోమలను నివారించవచ్చని పేరూరు వైద్యాధికారి రాహిల్ సూచించారు. మండల పరిధిలోని పెద్దగంగారం గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించి 30మందిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రాహిల్ మాట్లాడుతూ వానాకాలంలో మలేరియా, డెంగి, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వాటిని రాకుండా చూసుకోవడంలో భాగంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని దోమలను నివారించడం ఒక్కటే మార్గమని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. గర్భిణులను, బాలింతలను పరీక్షించారు. ఈ వైద్యశిబిరంలో హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మమన్‌యాదవ్

ములుగు రూరల్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమన్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌ల అమ్మకాలు చేపడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిరాం, పూర్ణ, శ్రీనాథ్, అఖిల్, సంతోష్ పాల్గొన్నారు.

లారీలు ఢీ.. ట్రాఫిక్‌కు అంతరాయం


లారీని తొలగిస్తున్న పొక్లెయినర్

వెంకటాపురం(కె) : మండల కేంద్రానికి సమీపంలో గల కంకల వాగు వద్ద బుధవారం రెండు ఇసుక లారీలు ఢీకొనడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి నష్టం జరగలేదు. లారీలు రోడ్డుపై నిలిచిపోవడంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకోని పొక్లెయినర్ సాయంతో లారీలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలి

- జీసీడీఓ రమాదేవి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రమాదేవి

కన్నాయిగూడెం : విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, మెనూ ప్రకారం భోజనం అందించాలని జీసీడీఓ రమాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ముప్పనపల్లి కేజీబీవీని జీసీడీఓ రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న వసతులను, విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యా బోధన, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రమాదేవి మాట్లాడారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.అందుకు కావాల్సిన ప్రణాళికను తయారు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి అశ్వినికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


ములుగు రూరల్: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


కన్నాయిగూడెం: ముప్పనపల్లిలో..

ములుగు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎక్సైజ్ ఎస్సై లింగయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని బండారుపల్లి మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. డ్రగ్స్ విక్రయించిన, వినియోగించిన చట్టపరంగా నేరమని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నియంత్రణ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ దేవిక ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ములుగు పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ములుగు ఎస్సై వెంకటేశ్వరావు మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్ కార్యక్రమం వారం రోజుపాటు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు అవగాహన ర్యాలీ

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(గురువారం) జిల్లా కేంద్రంలో కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తుల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత సంస్థ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తంగేడు స్టేడియం నుంచి డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని యువకులు అధిక సంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

డ్రగ్స్ నిర్మూలనపై..

కన్నాయిగూడెం : డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై ముప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థులు ,యువత కృషి చేయాలని ఎస్సై వెంకటేష్ వివరించారు.అనంతరం పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. హెడ్‌కానిస్టేబుల్ స్వామి, కానిస్టేబుల్ లాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు వద్ద ఆనంద్

మల్హర్ /కాటారం: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎడ్లపల్లి పంచాయతీ పరిధిలోని శుభాష్‌నగర్‌లో బుధవారం జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన పిల్లమారి ఆనంద్ తన ఎద్దును మేతకు వదిలాడు. ఎద్దు మేత మేస్తున్న క్రమంలో కాటారం మండలం రేగులగూడెం ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు ఆనంద్ వేడుకుంటున్నాడు.